# సత్యం రమణీయమ్

## ఆస్కార్ వైల్డ్

తెలుగు: హెచ్చార్కె



నాటకం

ఆస్కార్ వైల్డ్

# సత్యం రమణీయమ్

*సీరియస్ మనుషుల కోసం ఒక చిల్లర సుఖాంత నాటకం*

The Importance of Being Earnest

*A trivial comedy for serious people*

తెలుగు: హెచ్చార్కె

Sathyam Ramaneeyam
(The Importance of Being Ernest)
By Oscar Wilde
Telugu: hrk

Cover design: Ramana GV

Cover pix: Ananya
‘Mommy I made a boy’ shouted three old Ananya after arranging things on the carpet.

Fist online edition: November, 2011

Price: Rs. 50

Translator’s thanks to Rama Rao Peddi, Ramana GV, Anil Atluri and Kiran Kumar Chava

# పరిచయం

**రచయిత:**

ఆస్కార్ వైల్డ్ (1854-1900) డబ్లిన్ (ఐర్లాండ్) లో పుట్టి పెరిగారు. డబ్లిన్ లోని ట్రినిటీ కాలేజ్ లో, ఆక్స్ ఫర్డ్ లో మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. రచయితగా, లెక్చరర్ గా, ఇంకా పలు రంగాలలో పని చేసి ఇంగ్లాండులో ప్రముఖ వ్యక్తిగా కీర్తి సంపాదించారు. గిల్బర్ట్, సల్లివాన్ లు తమ 'పేషన్స్' ఒపేరాలో వైల్డ్ ని ఒక సౌందర్య వాది (aesthete) గా క్యారికేచర్ చేశారు. (చేతిలో పువ్వు పట్టుకుని ప్రముఖ పికడిల్లీ స్ట్రీట్‌లో నడిచాడని ఒక కథ). వ్యవహారం నవ్వు పుట్టించే దశను దాటిపోయిందేమో, వైల్డ్ 1895లో స్వలింగ సంపర్కం నేరానికి గాను అరెస్టయ్యాడు. రెండేళ్లు కఠిన కారాగార శిక్ష తరువాత జైలు నుంచి విడుదలయి, ఫ్రాన్సుకు వెళ్లిపోయి మరణించే వరకు వేరే పేరుతో జీవించాడు. ఐరిష్ జాతీయుడైనప్పటికీ ఐరిష్ వుద్యమంతో సంబంధాలు పెట్టుకోలేదు. డబ్ల్యు. బి. ఏట్స్ ఐరిష్ గాథలతో నాటకాలు రాస్తుంటే, ఆస్కార్ వైల్డ్ డ్రాయింగ్ రూం సుఖాంతాలు రాస్తూ వుండిపోయాడు.

**రచన**:

'సత్యం రమణీయం' ('The Importance of being Earnest') నాటకం కథలో కొత్తదనం ఏమీ లేదు. ఇది అన్ని సుఖాంత నాటకాల కథే.... ఒక అబ్బాయి ఒక అమ్మాయి ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకోడం, దానికి దాటరానివనిపించే అడ్డంకులు ఎదురు కావడం, చివరికి వాళ్లు అడ్డంకులను అధిగమించి సంతోషంగా ఒక్కటైపోవడం- ఇది దాదాపు అన్ని సుఖాంత నాటకాల్లో కనిపించే కథా వస్తువే. ఈ నాటకంలో ఒకటికి బదులు రెండు జంటలు వుండడం కూడా కొత్తది కాదు. షేక్స్పియర్ సుఖాంత

నాటకాలు చాలా వాటిలో రెండు జంటల ప్రేమ కథలు కనిపిస్తాయి. ఆయన ‘A Midsummer Night’s Dream’ తదితర నాటకాల్లో ఇలాగే రెండు రెండు జంటల ప్రేమికులు చాల అవరోధాల్ని అధిగమించి పెళ్లి మంటపం చేరుకుంటారు. కథ మేరకు చూస్తే, ఈ వైల్డ్ నాటకంలో కొత్తదనం ఏమీ లేదు.

ప్రహసనం (Farce) అనేది “భాషా చాతుర్యం, పాత్ర చిత్రణలో మెలకువల మీద కాకుండా, ప్రధానంగా హాస్య సంఘటనల (సిటువేషన్స్) మీద ఆధార పడి వుండే సుఖాంత నాటకం” అని వివరణ. హాస్య సంఘటనలంటే మగవాడు పొరపాటున ఆడవాళ్ల రెస్ట్ రూంలోకి వెళ్లిపోవడం వంటివి. ప్రహసనాలలో... సాధారణంగా మంచాల కింద దాక్కోడం, చిత్ర విచిత్ర మారు వేషాలు, ఒకటి చేయబోయి ఇంకొకటి చేసే తత్తరపాటు, త్వరత్వరగా కదిలిపోయే, ఆశ్చర్య పరిచే పనులు (యాక్షన్).... వీటికి ప్రాధాన్యం వుంటుంది.

అందరూ కాకపోయినా, చాల మంది ఈ నాటకాన్ని ‘ప్రహసనం’గానే గుర్తిస్తున్నారు. మనకు తెలిసిన, మనం ఫీలయ్యే వాస్తవ జీవితంతో సంబంధం లేని, పూర్తి అసంభావ్య సంఘటనలతో కూడిన ఈ నాటకంలో ఆంగిక నటన (యాక్షన్) కన్న భాషా చమత్కారాలకు ఎక్కువ ప్రాధాన్యం వుంటుంది. మొదటి ప్రదర్శన తరువాత ఏడేళ్లకు 1902లో రెండో విడత ప్రదర్శనకు వచ్చినప్పుడు ఈ నాటకం గురించి మాక్స్ బీర్బొమ్ ఇలా అన్నారు:

> “నాటకంలో స్కీము మామూలుదే. ఒక యువకుడు జల్సాగా గడపడం కోసం పల్లె నుంచి సిటీకి రావడం, మరో యువకుడు అదే విధంగా సిటీ నుంచి పల్లెకు వెళ్లడం, దాని వల్ల ఏర్పడే గందరగోళం ఇందులో ప్రధాన కథా వస్తువు, (కాని) ఇందులోని వ్యంగ్యం ప్రధానంగా పాత్రలు ఏం చేస్తాయనే దాని మీద కన్న ఏం మాట్లాడతాయనే దాని మీద ఆధార పడి వుంటుంది. పాత్రలు అందమైన నాన్సెన్స్ మాట్లాడుతాయి.

మంచి హాస్య నాటక భాషను వుపయోగించుకుని సృష్టించిన ఫ్యాంటసీ ఇది. విశిష్ట మేధా శక్తి, విశిష్ట వూహాశక్తి కలగలిసి భాషతో, భావనల (ఐడియాస్) తో అడుకునే ఆటగా నాటకంలో సంభాషణ (డయలాగ్) నడుస్తుంది.''

ఉపరితలంలో నాటకం వుత్తుత్తి మెరుపుల్లా కనిపించినప్పటికీ (వైల్డ్ దీన్ని 'సీతాకోక చిలుకల కోసం ఒక సీతాకోక చిలుక రాసిన' నాటకం అన్నాడు) ఇందులో సీరియస్ విషయాలున్నాయని, నాన్సెన్స్ ముసుగులో రచయిత సీరియస్ విషయాలు మాట్లాడాడని నొక్కి చెప్పిన విమర్శకున్నారు. ఈ దృక్పథం ప్రకారం, వైల్డ్... సత్యం చెప్పి నవ్వించాడు. పిల్లచేష్టల రూపంలో సీరియస్ వ్యంగ్యం రాశాడు. పెళ్లి, డబ్బు, విద్య, నిజాయితీ (సత్యం రమణీయంగా వుండడం లేదా వుండకపోవడం), వర్గ సంబంధాలు, మరణం... ఎన్నెన్నో జీవన సమస్యలను స్పృశించాడు. ఉదాహరణకు... సత్యం అనే యువకుని పుటకకు సంబంధించిన అసంబద్ధ (అబ్సర్డ్) పరిస్థితులపై శారదాంబ వ్యాఖ్యానం వింటున్నప్పుడు మనం ఆమె ఆడంబరం మీద విమర్శ దగ్గరే ఆగుతామా లేక, ఆమె మాటల్ని మనం కూడా ఇష్టపడతామా? చెప్పడం కష్టం!

> 'ఒక బుట్టలో... దానికి మంచి లెదర్ హాండిల్స్ వుంటేనేం లేకుంటేనేం... బుట్టలో పుటక, పెంపకం ... ఇది సాధారణ కుటుంబ జీవితం పట్ల తూష్ణీభావాన్ని తెలియజేస్తుంది. ఫ్రెంచి విప్లవ కాలంలో తయారైన వైపరీత్యాలలో ఇది ఒకటి. ఆ దురదృష్టకర వుద్యమం ఎక్కడెక్కడికి దారి తీసిందో అందరికీ తెలిసిందే.'

పాఠకులు ఈ నాటకాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. జీవన వాస్తవికతకు తిలోదకాలిచ్చిన కళారూపంగా, జీవితం మీద పరోక్షంగా వ్యాఖ్యానించే కళారూపంగా... రెండు విధాలుగానూ నాటకాన్ని పరిశీలించి, తమకు తాము ఒక అభిప్రాయానికి రావచ్చు. బహుశా, నాటకంలో సుబ్బారావు అన్నట్లు 'సత్యం ఎప్పుడూ అంత సాదాసీదాగా వుండదు. అది పరిశుద్ధంగా వుండడం కూడా అరుదే.'

**అనువాదం:**

నాటకం మొదట్లోనే మొదటి దృశ్యం వివరణలో వైల్డ్ 'సమయం: ప్రస్తుతం' అని రాశాడు. స్థల, కాలాల రీత్యా వైల్డ్ ప్రస్తుతానికి (అప్పటి కాలానికి) మన ప్రస్తుతానికి (ఇప్పటి కాలానికి) పెద్దగా వ్యత్యాసం లేదు. అందువల్ల, నాటకాన్ని భాషా పరంగానే కాకుండా స్థల, కాలాల పరంగా తెలుగు చేయడం సులభమయ్యింది. ఇరు భాషల వాక్య నిర్మాణంలో, వ్యక్తీకరణ రీతుల్లో, సంస్కృతి, ఆచార వ్యవహారాల్లో తేడాల రీత్యా అనువాసంలో స్వేచ్ఛ తీసుకోవడం తప్పనిసరి. ఉదాహరణకు- ఇంగ్లిష్ లో ఎర్నెస్ట్ అనే పదం క్రియా విశేషణంగా, నామవాచకంగా పని చేసింది. తెలుగులో అలాంటి పదం దొరక్క వైల్డ్ వూహకు దగ్గరగా వుండే మరో వూహను అనుసరించక తప్పలేదు. సుగుణమ్మ (మూలంలో మిస్ ప్రిజమ్) పాపాయిని వుంచిన బుట్టను రైల్వే స్టేషన్లో పోగొట్టుకునే సంఘటననను వున్నదున్నట్లు తెలుగు చేస్తే, ఆమె స్టేషన్ కు ఎందుకెళ్లిందనే ప్రశ్న అనవసరంగా మిగిలిపోతుంది. ఇటువంటి అదనంగా రెండు మూడు వాక్యాలతో కొంచం అతుకు-పని జరిగింది. అయినా; వైల్డ్ చేసిన వ్యాఖ్యానాలు, సంఘటనలూ (సిటుయేషన్స్) సంఘటనాత్మక వ్యంగ్యం (ఐరనీ), భాషా భావాలతో ఆయన ఆడిన హృద్యమైన ఆట తెలుగులోకి వచ్చాయి. మూలం నుంచి పక్కకు తొలగింది చాల స్వల్పం. ఇప్పడీ అనువాదం ప్రధానంగా ప్రదర్శన కోసం కాకుండా చదువుకోడానికి ఉద్దేశించినది. అందుకే, మూలాన్ని దాదాపు యథాతథంగా అనుసరించాం. ప్రదర్శన సమయంలో మరింత స్వేచ్ఛకు వీలుంది, ఎప్పటికెయ్యది 'ప్రస్తుత'మో జాగర్తగా చూసుకుని.

## *అంకం: ఒకటి*

దృశ్యం: బంజారా హిల్స్ లో సుబ్బారావు ఇల్లు, లివింగ్ రూమ్. సమయం: ప్రస్తుతం. గది కాస్త ఖరీదుగా వుంటుంది. పక్క గది లోంచి పియానో వాయిస్తున్న శబ్దం వినిపిస్తుంటుంది. ఇంటి పనివాడు రంగన్న డైనింగ్ టేబుల్ మీద తేనీటి సామాగ్రి, బ్రెడ్ బటర్, దోసకాయ శాండ్విచెస్ సర్దుతుంటాడు. పియానో శబ్దం ఆగిపోయాక పక్క గది లోంచి సుబ్బారావు వస్తాడు.

సుబ్బరావు: పియానో విన్నావా, రంగన్నా, బాగా వాయించాను కదూ?!

రంగన్న: విన్లేదు సార్, పక్క గదిలోవి వినడం మర్యాద కాదు కదా!

సుబ్బారావు: భలేవాడివే. అందుకే అప్పుడప్పుడు నిన్ను చూస్తే జాలేస్తుందోయ్. నేనేం తప్పుల్లేకుండా వాయించలేదు. తప్పుల్లేకుండా వాయించడం ఎవరయినా చేస్తారు. అదేం గొప్ప కాదు. పియానో అంటే సెంటిమెంటు పండాలోయ్, సెంటిమెంటు. నా మట్టుకు నేను భావాల్ని అద్భుతంగా పలికిస్తాను. ఎక్స్ ప్రెషన్ ముఖ్యం. శాస్త్రం అంటావా, అది కేవలం జీవితం కోసం.

రంగన్న: ఔను సార్!

సుబ్బారావు: ఔనూ, శాస్త్రం-జీవితం అంటే గుర్తొచ్చింది. శారదాంబ అత్తయ్యకు దోసకాయ శాండ్విచెస్ అంటే భలే ఇష్టం. అవి రెడీ చేశావా మరి?

రంగన్న: ఎప్పుడో తయారు చేశాన్సార్! (శాండ్విచెస్ ఒక ప్లేటులో అందిస్తాడు.)

సుబ్బారావు: (వాటిని పరీక్షగా చూస్తాడు. ఒకటి చేతిలోకి తీసుకుని కొరుకుతూ సోఫాలో కూర్చుంటాడు.) రంగన్నా ఇంతకు ముందే నీ వంటగది నోట్‌బుక్ చూశాను. అన్నీ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=474**